మినీ కథ

# అంచనా

వెంకటేశం మా ఇంటికి నాల్గయిదిళ్ళ అవతల వుంటాడు. పేపరు చదవడానికి మా ఇంటికొస్తుంటాడు. ఉద్యోగం చిన్నదయినా సంసారం పెద్దదే. బాగానే మాట్లాడతాడు. ఎన్నో విశేషాలు చెప్పేవాడు. అంతవరకు బాగానే వుంది. ఏదో ఇరవైయో అప్పుకూడా అడిగేవాడు. తర్వాత తర్వాత వాళ్ళావిడ కూడా మా ఇంటికొస్తూండేది. మెల్లగా మా ఆవిడతో పరిచయం పెంచుకుంది. వెంకటేశం నా దగ్గర డబ్బులు అప్పు ఎలా తీసుకునేవాడో, అతని భార్య పోపు సామానులు, పాలు, మజ్జిగ మొహమాటం లేకుండా అడిగి తీసుకునేది.

రానురాను వీళ్ళ ప్రవర్తన చాలా చికాకనిపించేది. తీసుకున్న అప్పు వెంటనే ఇవ్వలేక పోయేవాళ్ళు. మేము మధ్యమధ్యలో వ్యంగ్యంగా మాట్లాడినాకూడా బాధపడకుండా నవ్వేసుకునేవాళ్ళు. అప్పుడప్పుడు భోజనం కూడా మా ఇంట్లోనే. వీళ్ళ బాధ ఎక్కువయి పోయిందంటూ మా ఆవిడ ఒకటే గోల. నిజమే అనిపిస్తుంటుంది నాక్కూడా. అతను మట్టమూ కాదు. ఆఫీసులో కాలిగూ కాదు. కోరి తెచ్చుకున్న కొరివిలా వుంది వ్యవహారం.

ఆ రోజు నాకిష్టమైన కొత్త పిక్చరొకటొచ్చింది. త్వరత్వరగా మా ఆవిడను తయారుచేసి హాలు దగ్గరకు చేరుకున్నాం. సినిమా క్యూ చూస్తే కొండవీటి చేంతాడంత వుంది. చెమటలు కక్కుకుంటూ ఒకళ్ళనొకళ్ళు కుళ్ళ బొడుచు కుంటున్నారు జనం. ఈరోజు టిక్కెట్లు దొరకడం దుర్లభమేమో అనిపించింది.

నిస్పృహయంగా ఎటో చూస్తున్నాము. సినిమా వాల్ పోస్టర్ తీక్షణంగా చూస్తున్న వెంకటేశం మా కళ్ళల్లో పడ్డాడు. అటువైపునుండి గిరుక్కున మా వైపు తిరిగి చేయి గాలిలో ఊపుతూ రాసాగాడు. "వీడు ఇక్కడకూడా తగలడ్డాడూ!" అని కోపంగా తిట్టుకుంది మా ఆవిడ 'సినిమాకొచ్చారా' అంటూ నవ్వుతూ అడిగాడు వెంకటేశం. 'లేదు జనం ఉన్నారా లేదా అని చూడడానికి వచ్చాం" అందామనుకున్నాను.

"నేను కూడా చూడాలను కుంటున్నాను" అన్నాడు వెంకటేశం.

"ఇంత జనంలో ఈ సినిమా చూడకపోతే ఏమొచ్చిందిలెండి పోదాం" అని నా చేయి గిల్లింది కోపంగా మా ఆవిడ. వాడొస్తానవేసరికి మా ఆవిడకు కోపం వచ్చి అలా అంది.

"సినిమా మిస్ కాకండి సార్. చాలా బాగుంటుంది" అంటూ వెంకటేశం కిక్కిరిసిన జనంలో కలిసాడు.

పది నిమిషాల తర్వాత ముచ్చెమటలు కక్కుకుంటూ రేగిన జుట్టుతో వెంకటేశం మా దగ్గరి కొచ్చాడు. అతని చేతిలో మూడు డీలక్స్ క్లాస్ టిక్కెట్లు వున్నాయి.

"థ్యాంక్స్" అంటూ రెండు టిక్కెట్లకి డబ్బు తీసివ్వబోయాను.

"భలే వారండీ మీరు! ఈ సినిమాకి నేను మిమ్మల్ని తీసుకు వెళ్ళాలని నిశ్చయించుకుని టిక్కెట్లు పట్టుకొచ్చాను. మీ దగ్గర డబ్బులు తీసుకోవడమేమిటి. వుంచండి జేబులో" అంటూ ముందుకు నడిచాడు.

మేము చాలా సిగ్గు పడ్డాము. అతని టిక్కెట్టుకూడా ఎక్కడ కొనాల్సి వస్తుందోనని భయపడి వచ్చిన మాకు, మాక్కూడా అతనే టిక్కెట్లు కొన్నాడు. ఒక మనిషిలోని కొన్ని బలహీనతలను ఆధారంగా చేసుకుని వాళ్ళను తక్కువగా, నీచంగా అంచనా వెయ్యడం మానుకోవాలి. అలా అని నా మనసులో అనుకున్న వెంటనే వెంకటేశం భుజంపై చేయి వేసి 'పద కూల్ డ్రింక్ తాగుదాం' అంటూ షాపువైపు నడిచాను పరిపక్వమైన మనసుతో.

—జీడిగుంట నరసింహమూర్తి

## పండగ తెల్లారి...

వెల్లా వెదురుగా
రాలిపడిన టపాసు కాగితపు ముక్కలు

కాలిన గాయాలు
కట్టిన కట్లు

గువ్వ గువ్వమంటున్న
పండక్కి చేసిన అప్పు!

—వి.పి.చందన్ రావు


దీపావళి శుభాకాంక్షలు

మా వద్ద గృహాలంకరణకు
గృహ నిర్మాణమునకు అవసరమైన
అన్నిరకముల అద్దములు, ప్లయివుడ్స్
సన్‌గ్లాస్ మరియు అల్యూమినియం సామాన్లు
సరసమైన ధరలలో లభించును.

భాను మిర్రర్ ఇండస్ట్రీస్
రామమోహన్ ఆయుర్వేద హాస్పిటల్ వద్ద
బందర్ రోడ్, విజయవాడ-2, ఫోన్: 65714

BACHI
SOUND.